
# గుర్కనాదం



వారణాసి రామకృష్ణ

ఆఫీసు పనిమీద ఆరోజు ఉదయం సీతాపతి, గుర్నాధం - ఇద్దరూ ఢిల్లీకి వచ్చారు. కరోల్‌బాగ్ ఏరియాలో ఒక హోటల్‌లో రూం తీసుకున్నారు.

పగలు ఆడిట్ పని అయ్యాక ఎ.పి. భవన్‌లో డిన్నర్ చేసి హోటల్‌రూం చేరేసరికి రాత్రి పదిగంటలు దాటింది.

సీతాపతి బెడ్ మీద పడుకుని టీవీ రిమోట్ నొక్కాడు. ఏదో ఛానెల్‌లో వార్తలు వస్తున్నాయి. హైజాగ్‌కి గురయిన భారత విమానాన్ని చూపిస్తున్నారు. సీతాపతి ఆసక్తిగా చూస్తూ రోజు రోజుకీ హైజాకర్ల ఆగడాలు ఎలా మితిమీరి పోతున్నాయో గుర్నాధానికి చెప్పసాగాడు.

ఐదు నిమిషాలు కూడా కాకముందే హఠాత్తుగా పెద్ద శబ్దం!

తన మంచం ప్రక్కనే కాందహార్ విమానం లాండ్ అయినట్టు చప్పుడు. మాట్లాడుతున్నవాడల్లా సీతాపతి అదిరిపోయి అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు. గుర్నాధం కేసి చూస్తే - ప్రక్క బెడ్ మీద హాయిగా నిద్రపోతూ భయంకరమైన గురక పెడుతున్నాడు. గురక చప్పుడు రేసు గుర్రపు డెక్కల చప్పుడులా లయబద్ధంగా వుంది.

ఇదేం గురకరా బాబూ! ఈ లావిల్లో గురక పెట్టే మహానుభావులూ ఉంటారా? అయినా నేను మాట్లాడుతుంటే ఈ పెద్దమనిషి వింటున్నాడనుకుంటే ఇంతలోనే ఇంత నిద్దర్లోకి జారుకున్నాడా?

"ఓరి జీవుడా! నువ్వేం వింత మానవుడివిరా!"

సీతాపతి గుర్నాధంని చూసి నవ్వుకుని ఛానెల్ మార్చేడు. టీవీలో ఏదో హిందీ సినిమా వస్తోంది. గుర్నాధం గురక చప్పుడు డైలాగుల్ని చీల్చి చెండాడేస్తుంటే సీతాపతి రిమోట్ చేతుల్లోకి తీసుకుని వాల్యూం పెంచాడు.

అర్ధరాత్రి పన్నెండు దాటింది. నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో గుర్నాధం గురక చెవుల్ని గుభేల్‌మనిపిస్తోంది.

సీతాపతికి నిద్దర ముంచుకురాగా టీవీ ఆర్పి ట్యూబ్‌లైట్ తీసేసి బెడ్ ల్యాంప్ ఆన్ చేశాడు. గదిలో నీలిరంగు వెలుతురు పరుచుకుంది. సీతాపతి నిద్రపోయే ప్రయత్నం చేశాడు కానీ గుర్నాధం గురక అతని చెవుల్లో సీసం పోస్తున్నట్టుంది! గురక శబ్దానికి ఎంతకీ నిద్రపట్టడం లేదు. పక్కమీద అటు ఇటు దొర్లుతూ చాలాసేపు నిద్రపోయే ప్రయత్నం చేశాడు.

గురక చప్పుడు గుండెలమీద అరక దున్నినట్టు దున్నేస్తోంది! గురక చప్పుడు చెవుల్లో చెంచు నృత్యమై డప్పులు మ్రోగిస్తోంది! అసహనంగా సీతాపతి గుర్నాధం కేసి చూశాడు.

గుర్నాధం నోరు తెరిచి పళ్ళు బైటపెట్టి భయంకరంగా నిద్రపోతున్నాడు.

ఏం చెయ్యాలో అర్థం గాక ట్యూబ్‌లైట్ ఆన్ చేశాడు. గదంతా మళ్ళీ వెలుతురు. బ్యాగులోంచి పుస్తకం తీసి చదవసాగాడు. కానీ అదీ వీలు కాలేదు. పుస్తకం పేజీల్లోంచి, అక్షరం అక్షరంలోంచి గురక గుర్రుమని లేచి కళ్ళద్వారా మెదడును ఛిద్రం చేస్తున్నట్టనిపించింది.

విసురుగా పుస్తకాన్ని ప్రక్కకి గిరాటేసి మళ్ళీ టీవీ ఆన్ చేశాడు. ఏవో పాటలు, డాన్సులు! కాస్సేపు వాటిని చూసే ప్రయత్నం చేశాడు. అయినా గురక మాత్రం గుండెల్లో గునపాలని గుచ్చడం మానలేదు!

మళ్ళీ టీవీ ఆఫ్ చేసి ట్యూబ్‌లైట్ తీసేశాడు.

ఈసారి దిండు చెవులమీద వత్తిపెట్టి దుప్పటి నిండా కప్పుకుని అటు తిరిగి పడుకున్నాడు. కాస్సేపు మగతగా నిద్ర! కానీ ఈలోపే ఉలిక్కిపడి లేవక తప్పలేదు! మంచం ప్రక్కనే భూమిలోకి బోరింగ్ రిగ్గు దిగేప్పుడు వచ్చేంత శబ్దం! ఆ శబ్దం తన గొంతులోంచి గుండెల్లోకి, కడుపులోకి దిగుతున్నట్టుంది.

ఇదేం గురకరా బాబూ! అసహనంగా గుర్నాధం కేసి చూసి ఉలిక్కిపడ్డాడు. గుర్నాధం ఎప్పుడు లేచి చొక్కా బనీను విప్పేశాడో కానీ ఒక్క

దుంగ! పెద్ద పడుకుని ఉన్నాడు. భయ్యా పొట్ట ఎత్తుగా పెద్ద కొండలాగా ఉంది.

అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలకి అది పైకి లేస్తూ క్రిందికి దిగుతోంది.

పైకి లేస్తున్నప్పుడు సింహం గాండ్రింపులా అరుపులు!

క్రిందికి దిగుతున్నప్పుడు అడవిలో అర్ధరాత్రి నక్కల ఊళలు! ఏదో పెద్ద పర్వతం భూకంపం తాకిడికి అటు ఇటు కదులుతూ భయ భ్రాంతుల్ని చేస్తున్నట్లుగా ఉందా దృశ్యం!

ఇదేం గురకరా దేవుడా! వీడేం వింత మానవుడురా బాబోయ్! సీతాపతి నిట్టూరుస్తూ అనుకోగానే విశ్వేశ్వర్రావు చెప్పిన సంగతి గుర్తొచ్చింది.

ఢిల్లీకి వచ్చేముందు - గుర్నాధంతో అంతకు ముందోసారి ఇదేవిధంగా టూర్‌కెళ్ళి వచ్చిన విశ్వేశ్వర్రావు ఆఫీసులో కలిసి

"ఏం సీతాపతి! ఎప్పుడు ప్రయాణం?" అడిగాడు.

"రేపే విశ్వం!" తను ఉత్సాహంగా చెప్పాడు. విశ్వం తనని ఎగాదిగా చూసి

"నువ్వెళ్ళేది గుర్నాధంతోనే కదూ?" అనుమానంగా అడిగాడు.

"అవును. ఏం?" అమాయకంగా తను ప్రశ్నించాడు.

"అబ్బే ఏంలేదు! నీతో కూడా వచ్చేది గుర్‌నాదమేనా ఇంకెవరైనానా - అని డౌటొచ్చింది!" అన్నాడు గుర్నాధం పేరుని గుర్‌నాధం అని విరిచేసి!

అయితే అదీ సంగతి! ఆరోజు విశ్వం ఈ గుర్నాధాన్ని గుర్-నాదం అని విడగొట్టి సంబోధించాడు అంటే అతనూ ఈరకంగా ఎరక్కపోయి ఇరుక్కుపోయాడన్నమాట! నువ్వూ అమాయకంగ బలయిపోతున్నావురా అని ఇన్‌డైరెక్టుగా చెప్పడమేనన్నమాట! తనకే బుద్ధి లేదు! జ్ఞానం లేదు! అర్థం చేసుకోలేకపోయాడు!

సీతాపతి తనని తాను తిట్టుకుంటూ గుర్నాధం కేసి చూశాడు!

బానపొట్ట వీరలెవల్లో పైకీ కిందికీ ఊగుతునే ఉంది. గురకతో గది కంపిస్తూనే ఉంది! ఆహ్! ఏంపెడుతున్నావురా గురక! చంపుతున్నావు కదరా గుర్నాధం... గురక నాదం!

ఆవిధంగా సీతాపతి ఆ రాత్రే కాదు మరో రెండు రాత్రులు గడిచినా నిద్రపోలేదు. రోజూ రాత్రిళ్ళు ఇదే తంతు! గుర్నాధం గురక శబ్దం వింటూ రకరకాలుగా తనని తాను తిట్టుకుంటూ ఒక్కోసారి తన దురదృష్టానికి బాధపడుతూ విసుగ్గా రాత్రంతా ఆలోచనల్లో గడిపెయ్యటమే!

రెండు రోజులు అయ్యేసరికి సీతాపతి చిక్కి శల్యం అయి జబ్బుపడి లేచిన మనిషిలా సగం అయ్యాడు.

మూడోరోజు సాయంత్రం ఆరుగంటలయ్యే సరికి సీతాపతి చేస్తున్న ఆడిటింగు పని ఆపేసి "నాకివాళ తలనొప్పి దంచేస్తోంది గుర్నాధం! వెంటనే హోటల్‌కెళ్ళిపోతాను!" అన్నాడు.

గుర్నాధం ఆదుర్దాగా చూసి "అలాగే! మీరెళ్ళి రెస్టు తీసుకోండి! నేను మరో గంటయ్యాక పని పూర్తిచేసుకుని వచ్చేస్తాను!" అన్నాడు.

సీతాపతి సరాసరి హోటల్ రూం కొచ్చి అక్కడికే డిన్నర్ తెప్పించుకుని తిన్నాడు. బాగా అలసిపోయి ఉండటంతో నిద్ర ముంచుకొస్తోంది. అర క్షణానికి ఆరు చొప్పున ఆవలింతలు అమాంతం దూసుకొస్తున్నాయి. టైమ్ చూస్తే - తొమ్మిది కూడా కాలేదు.

మూసుకుపోతున్న కళ్ళని కంట్రోల్ చేస్కుంటూ గుర్నాధం వస్తే తలుపు తీసుకునే వీలుగా తలుపు దగ్గరిగా వేసి అలాగే వచ్చి మంచం మీద వాలిపోయాడు. ఐదు నిమిషాల్లోపే గాఢ నిద్దర్లోకి జారిపోయాడు.

బాగా తెల్లారాక మెలకువ వచ్చి చూస్తే - గుర్నాధం మంచం మీద పద్మాసనం వేసుకుని కూర్చుని ఉన్నాడు. కళ్ళు చింత నిప్పుల్లా ఎర్రగా ఉన్నాయి. సీతాపతిని గుర్రుగా చూస్తూ

"ఏంటి సీతాపతి! రాత్రి అంతలా నిద్రపోయావు! నేను వచ్చిన సంగతి కూడా నీకు తెలీదు!" నిష్ఠూరం ధ్వనించే గొంతుతో అదో రకంగా అన్నాడు. సీతాపతి ఏమీ మాట్లాడకుండా నవ్వేశాడు.

ఇక అది మొదలు అక్కడున్న వారం రోజులూ సీతాపతి సాయంత్రం ఆరుగంటలకల్లా పని ముగించుకుని ఒక్కడే హోటల్ చేరుకుని తొమ్మిది కాకుండానే ముసుగు బిగించిసేవాడు. సీతాపతి తాపత్రయమంతా గుర్నాధం కంటే ముందే గాఢ నిద్దర్లోకి జారుకోవాలి! అతని గురక బారినుండి తప్పించుకోవాలి!

ఆరకంగా ఢిల్లీ టూరు విజయవంతంగా ముగించుకుని సీతాపతి హైద్రాబాద్ చేరుకున్నాడు. గుర్నాధం గురక బారినుండి తనెంత తెలివిగా తప్పించుకున్నది విశ్వంతో గర్వంగా చెప్పాలను కుంటూ ఆఫీసులోకి అడుగుపెట్టాడు.

లోపల తన సెక్షన్‌లో విశ్వం, గుర్నాధంలిద్దరూ మాట్లాడుకోవటం వినిపించింది.

"ఏం గురూ! గుర్నాధం! ఏంటి ఢిల్లీ టూరు విశేషాలు? ఇవాళేనా రావటం?" విశ్వం గుర్నాధాన్ని అడిగాడు.

"ఆ.. ఇవాళే ఆఫీసుకి రావటం! విశేషాలకే ముందీ షరా మామూలే"'

గుర్నాధం నీరసంగా అన్నాడు.

"హోటల్ రూం బావుందా! సీతాపతి ఎలా ఉన్నాడు? రాత్రిళ్ళు సుఖంగా నిద్రపోయాడా? ఆహ్ ఏంలేదు, కొత్త ప్లేసు గదానని ఇలా అడుగు తున్నా!" విశ్వం గొంతులో వేళాకోళం!

గుర్నాధం చిరచిరలాడుతూ "సీతాపతికేం? బ్రహ్మాండంగా ఉన్నాడు. ఎటొచ్చి తిప్పలన్నీ నాకే! వెళ్ళిన రెండు రోజులు ఏం నిద్రపోయానో ఏమోకానీ తర్వాత నిద్రలేదు! ప్రతిరాత్రి శివరాత్రి జాగరణ చేశాను!" విసుగ్గా చెప్పాడు . విశ్వం ఆశ్చర్యంగా "అదేంటి నీకు నిద్ర బాగా పట్టలేదా?" అడిగాడు.

"ఏం నిద్ర! నా మొహం నిద్ర! సీతాపతి పెట్టే గురక భరించలేక చచ్చాననుకో! అయినా అదేం గురకరా బాబూ! ఎర్రకోట బీటలు వారినట్టు - ఫిరంగులు - చెవుల్లో పేలినట్టు - భూకంపం హోటల్ గదికే వచ్చినట్టు! వారం రోజులు నిద్రలేక నరకం అనుభవించాను! ఇక మీదెప్పుడూ సీతాపతి తో ఆఫీసు పనిమీద పొరుగూరు వెళ్ళను గాక వెళ్ళను!" గుర్నాధం ఏడుపు గొంతుతో గట్టిగా చెబుతుంటే సీతాపతి నిర్ఘాంతపోయి అక్కడే కర్రలా బిగుసుకుపోయి నిలబడ్డాడు!

❋

## ప్రేమ ఎంత కఠినం

సహజంగా ప్రేమ ఎంత మధురం. ప్రేయురాలు అంత కఠినం అని కదా పాడుకుంటారు. కరిష్మా మాత్రం ప్రేమ ఎంత కఠినం, అభిషేకు ఎంత మధురం అని కన్నీళ్ళతో పాడుకుంటోంది. కరిష్మా నెంబరు వన్ స్థానంగా వున్న రోజుల్లో అభిషేక్ ఎ బిగ్ జీరో... అతని సమయం అంతా కరిష్మా కనుసన్నల్లో పడ్డానికే కేటాయించాడు. అయితే అదే నిజమయిన ప్రేమనుకొని మనసు పారేసుకున్న కరిష్మా ఆలస్యంగా తెలుసుకుంది. అభిషేక్ ఒక ఉక్కు పంజరంలో వున్నాడని. కెరీర్ లేకపోయినా డోంట్‌కేర్. అభిషేక్ లేకపోతే నేను బ్రతకలేను అంటోంది కరిష్మా.

*(అభిషేక్ మాత్రం డబ్బులుంటే బ్రతికెయ్య గలం అంటున్నాడు)*

